క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



సబ్‌కలెక్టర్‌కు పూలమొక్క అందజేస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్

ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ సూచించారు. కోసిగి నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన వేణుగోపాల్ శుక్రవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూపరమైన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్‌కు సూచించారు. ప్రజా సమస్యల పట్ల అలసత్వం వహించరాదని, మీ ద్వారా పరిష్కారం కాని సమస్యలను తనదృష్టికి తీసుకురావాలని చెప్పారు.

తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలి



గంజిళ్ల రోడ్డులోని పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సిబ్బందికి సూచించారు. శుక్రవారం పట్టణంలోని గంజిళ్ల రోడ్డులో ఉన్న తాగునీటి పంప్ హౌస్‌ను ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం గంజిళ్ల రోడ్డు, షరాఫ్ బజార్, కర్నూలు బైపాస్ రోడ్డు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాతో పాటు పారిశుధ్య పనులను తనిఖీ చేశారు.

డాక్టర్‌కు సన్మానం



మనోజ్‌ను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

కోసిగి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసి బదిలీపై వెళ్లిన మనోజ్‌కుమార్‌ను శుక్రవారం ఆస్పత్రి సిబ్బంది, ఇన్‌చార్జ్ డాక్టర్ రాజకిరిటీ సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. కాగా మనోజ్‌కుమార్ ఆరేళ్ల పాటు ఇక్కడ పనిచేసి ఇటీవల జరిగిన బదిలీల్లో కర్నూల్ తాండ్రపాడుకు వెళ్లారు. కార్యక్రమంలో డాక్టర్లు మౌనిక, రజిత, కౌతాళం వైద్యాధికారి కిరణ్, సీహెచ్‌ఓ ఈశ్వరమ్మ, ఎంపీహెచ్‌ఓలు శ్రీనివాసులు, ఎల్లప్ప, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న టౌన్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పట్టణ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. స్థానిక సోగనూర్ రోడ్డులోని జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం సైబర్‌నేరాలు, శక్తి యాప్, ఉమెన్, చైల్డ్ సేఫ్టీ, వాట్సప్ నెంబర్స్, రోడ్డు ప్రమాదాలు తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్‌కు వచ్చే లింక్‌లను ఓపెన్ చేయొద్దన్నారు. శక్తి యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని, చిన్న పిల్లలు బైక్‌లు నడపరాదని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆదోని అర్బన్: పట్టణంలోని శిల్పా సౌభాగ్య నగర్‌లో పేకాట ఆడుతున్న వారిని టూటౌన్ ఎస్ఐ రామ్‌నాథ్ శుక్రవారం దాడి చేసి అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.19,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. హుసేన్, శాంతకుమార్‌తో పాటు మరో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదు

గోనెగండ్ల: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు సీట్ల కేటాయింపులో ప్రిన్సిపాల్ అవినీతికి పాల్పడినట్లు ఆర్‌పీఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆఫ్రిది, జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ఆర్‌యూఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘునాథ్ శుక్రవారం కర్నూలులో జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్‌కు ఫిర్యాదు చేశారు. ఆరవ తరగతి ప్రవేశ పరీక్షలో మెరిట్ వచ్చిన విద్యార్థులకు కాకుండా తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులకు సీట్లు కేటాయించారని విచారించి చర్యలు తీసుకోవాలని కోరగా డీఈఓ సానుకూలంగా స్పందించారని విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు.

జై జగన్నాథ!



రథంపై కొలువుదీరిన పూరి జగన్నాథస్వామి



రథయాత్ర ముందు మహిళల నృత్యాలు



సుభద్ర, బలభద్రస్వామి, రథయాత్రలో పాల్గొన్న భక్తులు



రథయాత్రలో పాల్గొన్న గుజరాతి మహిళలు



యాత్రలో పాల్గొన్నఎమ్మెల్యే పార్థసారధి

- జగన్నాథుడి నామస్మరణంతో మార్మోగిన ఆదోని పట్టణం
- ప్రధాన రహదారుల్లో పూరీ జగన్నాథ రథయాత్ర

ఆదోని అర్బన్: పట్టణంలో పూరీ జగన్నాథుడి రథయాత్రం శుక్రవారం వైభవంగా జరిగింది. ప్రధాన రహదారుల్లో సాగిన రథయాత్రకు భక్తులు భారీగా హాజరయ్యారు. దీంతో పట్టణ వీధులు కిటకిటలాడాయి. విశ్వహిందూ పరిషత్, సోని, మహేశ్వరి, గుజరాతీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన రథయాత్రలో జగన్నాథుడి నామస్మరణ మారుమోగింది. స్థానిక మంగళ ఆంజనేయస్వామి ఆలయంలో ముందుగా పూరీ జగన్నాథస్వామి, సుభద్ర, బలభద్రస్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహాలను రథంపై అధిష్టింపజేసి యాత్ర ప్రారంభించారు. మంగళ ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన రథయాత్ర కోట్ల కూడలి, పాత బస్టాండు, ప్రభుత్వ ఆసుపత్రి మీదుగా విక్టోరియాపేటలో వెలిసిన పాండురంగ స్వామి ఆలయం వరకు సాగింది. రథ యాత్ర ముందు డోలు, సన్నాయిల మధ్య భక్తులు, మహిళలు, పురుషులు ఆనంద పరవశంతో నృత్యం చేశారు. ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి రథయాత్రలో పాల్గొన్నారు.

ఉన్న ఇంటిని కాజేశారు!



ఇంటి పట్టాను చూపుతున్న జంగం వీరయ్య

నందవరం మండలం నాగలదిన్నె గ్రామం 2009 వరదల్లో పూర్తిగా మునిగిపోయింది. అప్పటి ప్రభుత్వం వరద బాధితులను ఆదుకోవడానికి ఇళ్ల పట్టాలను మంజూరు చేసింది. ఇక్కడ కనిపిస్తున్న జంగం వీరయ్య భార్య జంగం కవిత పేరుపై కూడా ప్రభుత్వం ఇంటి పట్టా మంజూరు చేసి ఇల్లు నిర్మించి ఇచ్చింది. అయితే పేద దంపతులు జంగం వీరయ్య, కవిత ఏడాది కింద బతుకుదేరువు కోసం బళ్లారి జిల్లా ఇంట్లాపురం గ్రామానికి వలస వెళ్లారు. అక్కడ ఓ శివాలయంలో పూజరిగా పనిచేస్తూ జీవనం సాగిస్తూ అప్పుడప్పుడూ నాగలదిన్నెకు వచ్చిపోయే వారు. కొంతకాలంగా నాగలదిన్నెకు రాకపోవడంతో ఇదే అదునుగా భావించిన అదే గ్రామానికి చెందిన రుక్మాస్ బాషా అక్రమించుకుని బంగి వీరబాబుకు విక్రయించాడు. విషయం తెలుసుకున్న జంగం వీరయ్య గ్రామానికి చేరుకుని ఇల్లు తనదేనని పట్టా కూడా చూపాడు. కానీ వీరాబాబు మాత్రం తనకు రుక్మాస్ బాషా విక్రయించాడని చెప్పడంతో చేసేదేమీ లేక వీరయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇల్లు తమకు ఇప్పించి న్యాయం చేయాలని బాధితుడు వేడుకుంటున్నాడు. - నందవరం

సంక్షిప్తం

బాధిత కుటుంబానికి పరామర్శ

నందవరం: మండల కేంద్రంలో అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడిన పూలకుర్తి రాముడు కుటుంబాన్ని శుక్రవారం ఏపీ రైతు సంఘం నాయకులు పరామర్శించారు. మృతుడి భార్య గోవిందమ్మను కలిసి వారు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్ మాట్లాడుతూ రైతన్న కష్టపడి పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించకపోవడంతో అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం అందించాలని, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సబ్సిడీతో పంపిణీ చేయాలని కోరారు. రైతు రాముడి కుటుంబ సభ్యులకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రామలింగడు, ముని, యల్లప్ప, నల్లన్న, హనుమంతు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ

ఆదోని సెంట్రల్: స్థానిక ఆర్ఆర్ లేబర్ కాలనీలోనున్న మున్సిపల్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కె.రవి అధ్యక్షతన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ సి.హెచ్.లోకేశ్వర్ శుక్రవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరచంద్రయాదవ్, గిడ్డారెడ్డి, శ్రీనివాసులు, నిర్మల, మహేశ్వరి, హనుమంతు, బ్రహ్మానందరెడ్డి, నాయకులు జగదీష్, మల్లికార్జున, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మించాలని ధర్నా

మంత్రాలయం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానానికి ప్రహరీ నిర్మించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేపట్టారు. శుక్రవారం స్థానిక పాఠశాల నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థామస్ మాట్లాడుతూ.. ప్రహరీ లేకపోవడంతో మైదానంలో వాహనాలు నిలుపుతున్నారని చెప్పారు. అంతేగాక కొందరు పాత పాఠశాల గదుల్లో మద్యం సేవించడం, ఇతర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రహరీ నిర్మాణం చేపట్టాలని కోరారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



ఎమ్మిగనూరు సర్కిల్‌లో ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టారీతిగా ఫీజులను వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై అధికారులు చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మిగనూరు సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ నిబంధనలు పాటించని పాఠశాలలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అధిక ఫీజులను అరికట్టి తల్లిదండ్రులపై భారం తగ్గించాలని కోరారు. పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు జయకర్, కిరణ్, మహేష్, ఉపేంద్ర పాల్గొన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన



వాష్‌రూమ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ సీఈ వివేకానందరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్ట్ ఆవరణలో రూ.31లక్షలతో నిర్మిస్తున్న వాష్ రూమ్ పనులను శుక్రవారం ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ వివేకానందరెడ్డి పరిశీలించారు. రూ.2.63 కోట్లతో నాగలదిన్నె, మంత్రాలయం రోడ్డులో వంతెన నిర్మాణానికి రోడ్డును పరిశీలించారు. ఎస్ఈ మహేశ్వర్‌రెడ్డి, ఈఈ దండు వెంకటేశ్వర్లు, డీఈఈ నాగరాజు, ఏఈఈ విజయనరేష్, ప్రభు, కాంట్రాక్టర్లు ఉన్నారు.

కొలువుదీరిన పీర్లు



గోనెగండ్లలో కొలువైన పీర్ల దేవుళ్లు

గోనెగండ్ల: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో శుక్రవారం పీర్ల దేవుళ్ల కొలువుదీరారు. కులమతాలకు అతీతంగా గ్రామ పెద్దలు పీర్ల చావిడి వద్దకు వెళ్లి మేళతాళాలతో పీర్లను ప్రతిష్టించారు. జూలై 3న చిన్న సరిగెత్తు, 4న పగటి సరిగెత్తు, 5న పెద్ద సరిగెత్తు, 6న మొహర్రం నిర్వహిస్తున్నట్లు ముజావర్లు తెలిపారు. కాగా గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో వేడుకలను జరుపుకోవాలని సీఐ విజయభాస్కర్ సూచించారు. ఘర్షణలకు, అసాంఘిక కార్యకలపాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



ఎమ్మెల్యే పార్థసారథికి వినతి పత్రం అందజేస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

ఆదోని అర్బన్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు ఎమ్మెల్యే పార్థసారథికి వినతి పత్రం అందజేశారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంఘం గౌరవాధ్యక్షుడు నాగరాజు, అధ్యక్షుడు బసవరాజు, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యక్షులు ఉరుకుందప్ప, విజయ్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సమస్య చాలాళ్లుగా అపరిష్కృతంగా ఉందని, ఎన్నికల సమయంలోనే ఇంటి స్థలం కేటాయిస్తామని చెప్పడంతో ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నామన్నారు. జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు వీలుగా ప్రభుత్వం తగిన ఉత్తర్వులు జారీ చేయాలని, అలాగే ఇళ్లు కట్టుకునేందుకు తగిన ఆర్థిక సాయం అందించాలని కోరారు. అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులకు రైల్వేపాసు అందించేలా రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. నాయకులు మల్లికార్జున, యువరాజ్, మురళీకృష్ణ,ఖాన్, భీమా, రఘునాథ్‌రెడ్డి, సుంకన్న, వీరేష్, చంద్రయ్య, నరసింహులు పాల్గొన్నారు.

గోవులను రోడ్లపైకి వదలొద్దు

ఆదోని టౌన్: పట్టణ పరిధిలో ఆవులను విచ్చలవిడిగా బయటకు వదిలి ట్రాఫిక్ సమస్య సృష్టించొద్దని ఆవుల యజమానులకు మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ సూచించారు. ఆవులను విచ్చలవిడిగా రోడ్లపై వదలడం వల్ల వాహన దారులు, ప్రయాణికులు ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆవులను పోషకులు రోడ్లపైకి వదిలితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే..రోడ్లపై సంచరించే గోవులను గోశాలకు తరలిస్తామని స్పష్టం చేశారు.

నూతన దంపతులకు ఆశీర్వాదం



వధూవరులతో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

పెద్దకడబూరు: మండల పరిధిలోని మేకడోణ గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు రత్నం, మరియ మ్మ దంపతుల కుమారుడు నరసన్న, ప్రేమజ్యోతి వివాహం శుక్రవారం స్థానిక చర్చ్‌లో జరిగింది. వివాహానికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి హాజరై వధూరులను ఆశీర్వదించారు. మాజీ సర్పంచ్ షేర్ ఖాన్‌పటేల్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కిరాణం దుకాణంలో చోరీ

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని శివన్న నగర్‌లో ఓ కిరాణం దుకాణంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. కాలనీకి చెందిన రంగస్వామి కిరాణం షాప్ పెట్టుకొని, ఆటోను నడుపుకుంటూ జీవవనం సాగిస్తున్నాడు. అనారోగ్యంగా ఉండటంతో చికిత్స కోసం కర్నూలుకు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు రాత్రి దుకాణం వెనకాల బండలు పగలగొట్టి లోపలికి ప్రవేశించి రూ.8 వేల విలువ చేసే సిగిరెట్ ప్యాకెట్లు, 10 కిలోల బ్యాళ్లు, రూ.3 వేల నగదు చోరీ చేసినట్లు బాధితుడు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పరామర్శ



తిరుమల రెడ్డిని పరామర్శిస్తున్న చెన్నకేశవ రెడ్డి

గోనెగండ్ల: ఆరోగ్య సమస్యతో బాధపడుతూ కర్నూలులో చికిత్స పొంది తిరిగి ఇంటికి చేరుకున్న మాజీ సింగిల్‌విండో ప్రెసిడెంట్, వైఎస్సార్‌సీపీ నాయకుడు గంజిహళ్లి తిరుమల రెడ్డిని మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి పరామర్శించారు. శుక్రవారం ఆయన తిరుమల రెడ్డి స్వగృహానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు.

కళాశాల గుర్తింపును రద్దు చేయాలి

ఆదోని సెంట్రల్: ఐఐటీ, జేఈఈ మెయిన్స్, నీట్ పేర్లతో పుస్తకాలను అమ్ముతూ విద్యను వ్యాపారంగా మారుస్తున్న అక్షరశ్రీ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ, జిల్లా సహాయ కార్యదర్శి సోమశేఖర్, బీడీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం కళాశాల ఎదుట ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల నుంచి అధిక ఫీజులను వసూలు చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఇంటర్ బోర్డు నిబంధనలను పాటించకుండా కళాశాల నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు. నాయకులు ఉదయ్, నవీన్, ఉపేంద్ర, మహేష్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఆదోని రూరల్: ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ అల్లమ్మ గారి సరళమ్మ సూచించారు. మండలంలోని నారాయణపురం గ్రామంలో శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులతో మురుగు కాలువలను శుభ్రం చేయించారు. ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్యం లోపిస్తే తమ దృష్టికి తీసుకురావాలని గ్రామస్తులను కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు అల్లమ్మగారి పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇంటి పట్టా మంజూరు చేయండి

- స్థలాల మంజూరుకు అనువైన ప్రాంతాలను గుర్తించండి
- జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య ఆదేశం



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య

ఆదోని రూరల్: అర్హులైన ప్రతి కుటుంబానికి ఇంటి స్థలం మంజూరు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు, ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఇప్పటివరకు ఇంటి పట్టా కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎంత మంది అర్హులుగా ఉన్నారని ఆరా తీశారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల స్థలాన్ని మంజూరు చేయాలని ఆదేశించారు. అనుకూలమైన స్థలాలను వెంటనే గుర్తించి, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అధికారులు అర్హతల ప్రమాణాలు పరిశీలించి, అర్హులందరికీ లబ్ధి జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే..సర్వే పూర్తి అయిన గ్రామాల్లో ఇప్పటివరకు 1,474 జాయింట్ ఎల్‌పీఎంలు గుర్తించగా, కేవలం 309 దరఖాస్తులు మాత్రమే అందాయని తెలిపారు. మిగిలిన దరఖాస్తులు ఈనెల 30వ తేదీలోపు పూర్తి చేయాలని తహసీల్దార్‌లను ఆదేశించారు. ఈ మేరకు రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. 65 సంవత్సరాలు పైబడిన వారికి దివ్యాంగులకు రేషన్ సరుకులను 25 నుంచి 30వ తేదీ వరకు డోర్ డెలివరీలో ఎంతమందికి సరుకులు అందించారు, మిగిలిన వారికి ఎందుకు అందించలేకపోయారో వివరాలు ఇవ్వాలన్నారు. కౌలు రైతు కార్డులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆదోని డివిజన్‌లో 10,500 మంది రైతులు కౌలు కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నప్పటికీ కేవలం 1,100 కార్డులే నమోదయ్యాయని చెప్పారు. జూలై 15వ తేదీలోపు రెన్యూవల్ చేయాలన్నారు. డివిజన్‌లోని తహసీల్దార్‌లు, మున్సిపల్ కమిషనర్లు కృష్ణ, గంగిరెడ్డి, ఆదోని ఏడీఏ బాలవర్ధిరాజు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్స్ వేణుసూర్య, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

దర్గా నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

మంత్రాలయం: మండలం పరిధిలోని మాధవరం గ్రామంలో గోఖర్ ఉసేని తాత దర్గా నిర్మాణానికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. గ్రామంలోని ఆదోని రోడ్డు మార్గంలో దర్గాను నిర్మించనున్నారు. గ్రామస్తులు చందాలు వేసుకుని నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దర్గా నిర్మాణంలో తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. సకాలంలో నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. ఆయనతోపాటు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి, దర్గా పీఠాధిపతి ఫకృద్దీన్ ఖాద్రి, వీరయ్యస్వామి, హనుమంతురెడ్డి, జయరాం తదితరులు పాల్గొన్నారు.

తిప్పలదొడ్డిలో చిరుత కలకలం



కొబ్బరి చెట్టుపై ఉన్న చిరుత

కౌతాళం: మండల పరిధిలోని తిప్పదొడ్డిలో చిరుత కలకలం రేపింది. శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని కరణి గ్రామ రస్తాలో చిరు వ్యాపారి వీరేష్‌పై దాడికి ప్రయత్నించింది. కుక్కలు ఒక్కసారిగా రావడంతో చిరుత కొబ్బరి చెట్టుపై ఎక్కి కుర్చుంది. దీంతో రైతులు వణికిపోయారు. ఈ విషయం తిప్పలదొడ్డి, పక్క గ్రామాలైన కరణి, చిరుతపల్లి, మల్లనహాట్టి, కోసిగి మండలంలోని కొలమాన్‌పేట గ్రామల ప్రజలకు చేరడంతో వందల సంఖ్యలో ఆయా గ్రామాల ప్రజలు అక్కడికి చేరుకున్నారు. సర్పంచ్ మల్లయ్య, కౌతాళం పోలీసులతో పాటు ఆదోని అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు వచ్చేలోపు చెట్టుపై ఉన్న చిరుత ప్రజలను చూసి కిందకు దూకి పారిపోతుండగా కుక్కలు వెంటబడ్డాయి. చిరుత కుక్కలపై దాడికి దిగింది. కుక్కలు ప్రతిదాడి చేయగా అక్కడ నుంచి సమీపంలోని ముళ్లపొదల్లోకి చేరింది. అటవీ శాఖ ఆదోని డివిజన్ అధికారిణి తేజస్విని సిబ్బందితో ఘటన స్థలంలో నుంచి ప్రజలను దూరంగా పంపించేశారు. బంధించేందుకు బోను ఏర్పాటు చేసినా రాత్రి వరకు చిక్కలేదు. డీఎఫ్ఓ శ్యామాల పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

నీటి సమస్య పరిష్కరించాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సంజీవయ్య నగర్, రాఘవేంద్రనగర్ ప్రాంతాల్లో తాగు నీటి సమస్యను పరిష్కరించాలని సీఐటీయూ, డీవైఎఫ్ఐ నాయకులు రాముడు, రవికుమార్ డిమాండ్ చేశా రు. శుక్రవారం ఆయా ప్రాంతంలోని మహిళలతో కలిసి ఖాళీ బిందెలతో కుళాయిల వద్ద నిరసన తెలిపారు.శివారు ప్రాంతాల్లో కుళాయిలకు నీటిసరఫరా లేకపోతుండటంతో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని కోరారు.

డీఎస్సీ అభ్యర్థులకు బుట్టా ఫౌండేషన్ చేయూత



మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరుటౌన్:నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, సీనియర్ నాయకుడు బుట్టా శివనీలకంఠల సారథ్యంలోని బుట్టా ఫౌండేషన్ చేయూత ఇస్తోందని మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ పట్టణ కార్యదర్శులు గురువయ్యమాబ్బాషా, గడ్డం అంజి తెలిపారు. బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో డీఎస్సీ అభ్యర్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన సదుపాయం 22 రోజు శుక్రవారం కొనసాగింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు లతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు



అంబేద్కర్ విగ్రహం వద్దనున్న ఓహెచ్ఆర్‌ను శుభ్రం చేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు: స్థానిక పంచాయతీ పరిధిలో మంచి నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని పెద్దకడబూరు సర్పంచ్ రామాంజినేయులు అన్నారు. బాలవికాష్ పాఠశాల సమీపంలోని గుమ్మీల దగ్గర ఉన్న పైప్‌లైన్ లీక్ అయి నీరు వృథాగా పోతున్నాయని తన దృష్టికి రాగా శుక్రవారం పైపులకు వెల్డింగ్ చేయించినట్లు పేర్కొన్నా రు. అదే విధంగా ఎస్సీ కాలనీలో అంబేద్కర్ విగ్ర హం దగ్గర ఉన్న ఓహెచ్ఆర్‌ను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించినట్లు తెలిపారు. పంచాయతీ పరిధిలో ఎక్కడైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

రోడ్డెక్కిన మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు



రాస్తారోకో చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

ఎమ్మిగనూరుటౌన్: తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు శుక్రవారం రోడ్డెక్కారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీగా సోమప్ప సర్కిల్ వద్దకు చేరుకుని రాస్తారోకో చేపట్టారు. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈసందర్భంగా మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నారాయణ, రాజేంద్ర మాట్లాడుతూ ఇంజినీరింగ్ విభాగంలో టెక్నికల్ కార్మికులకు రూ.29,200, నాన్‌టెక్నికల్ కార్మికులకు రూ.24,500 చొప్పున నెలసరి వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, జాతీయ సెలవులతోపాటు ఆదివారం కూడా సెలవు ఇవ్వాలని కోరారు. విధినిర్వహణలో మృతి చెందిన కార్మిక కుటుంబాలకు రూ.10 లక్షలు, అంగవైకల్యం పొందిన కార్మికులకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు కారుణ్యనియామకం కింద కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు.

క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆదోని టౌన్: క్షయ వ్యాధిని పూర్తి స్థాయిలో నిర్మూలిద్దామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షైనాజ్‌బేగం అన్నారు. శుక్రవారం పట్టణంలోని హవన్నపేట యూపీహెచ్‌సీలో కౌన్సిలర్ గౌస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నవారు, గళ్లలో తెమడ, రక్తం పడటం, ఛాతిలో నొప్పి, ఆయాసం, శ్వాస ఆడకపోవడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, శరీరంలో ఇతర భాగాల్లో వాపు, కణితలు ఇలాంటి లక్షణాల్లో ఏ ఒక్కటి ఉన్నా ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్లు బాబురాజు, జ్ఞానేశ్వరి, సుబ్బమ్మబాయి పాల్గొన్నారు.